# సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 27 । నవంబర్ । 2023



**..ఆశీర్వదించే యోగానందుడు!**
ముదిగొండ మండలం యడవల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అభ్యర్థులు పూజలు చేసి ప్రచారం నిర్వహించడం ఆనవాయితీ. 6లో



**ఉద్యమకారులకు స్థానమేది ?**
తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాడిన వారికి కేసీఆర్ తన కేబినెట్‌లో సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని సీపీఐ నేత నారాయణ అన్నారు. 6లో

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం 31°/20°
జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి ప్రభావం కనిపిస్తుంది.

## న్యూస్‌రీల్

### రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### వైభవంగా జ్వాలా తోరణం



జ్వాలా తోరణం వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: కార్తీక పౌర్ణమి సందర్భంగా భద్రాద్రి రామాలయ అనుబంధ శివాలయంతో పాటు పలుచోట్ల ఆదివారం రాత్రి జ్వాలాతోరణం వేడుకను వైభవంగా నిర్వహించారు. కృత్తికా దీపోత్సవం సందర్భంగా రామాలయంలో ప్రత్యేక శోభ సంతరించుకుంది. వేకువజాము నుంచే భక్తులు పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, నదిలో దీపాలు వదిలారు. అనంతరం రామాలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితులు తీర్థ బిందెలు తీసుకొచ్చి స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ రమాదేవి, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

### పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

పాల్వంచ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి)అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ, బోనాలు, చీర, సారెలతో పాటు ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ రజనీకుమారి, పాలకమండలి సభ్యులు శ్రీనివాసరెడ్డి, గంధం వెంగళరావు, వెంకటరామారావు తదితరులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

### నేడు ఇల్లెందుకు రేవంత్‌రెడ్డి


ఇల్లెందు: ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య తరఫున ప్రచారానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సోమవారం రానున్నారు. పట్టణంలో ఉదయం 10 గంటలకు జరిగే రోడ్‌షోలో కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొంటారని పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఇల్లెందులోని కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ మువ్వా విజయ్‌బాబు, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడారు. టీపీసీసీ చీఫ్ సహా ముఖ్యనేతలు హాజరయ్యే రోడ్‌షోలో పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దొడ్డా డానియేల్‌తో పాటు యదళ్లపల్లి అనసూర్య, ఎస్‌కే జానీ, నవీన్, రంజిత్, ఈసం నర్సింహారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కనిపించని కమలదళం!

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీజేపీ ప్రభావం కనిపించడం లేదు. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం ఎంతో పోలిస్తే కమలదళం ప్రచారంలో వెనుకబడిందనే భావన ఆ పార్టీ కార్యకర్తల్లోనే వ్యక్తమవుతోంది.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- ఎన్నికల ప్రచారంలో ప్రభావం చూపని బీజేపీ, జనసేన
- నియోజకవర్గాల్లో మొక్కుబడిగా తిరుగుతున్న అభ్యర్థులు
- ఇప్పటి వరకు నిర్వహించిన బహిరంగ సభలు రెండే
- జాడలేని కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలు
- జిల్లాకు రాని అగ్రనేతలు, స్టార్ క్యాంపెయినర్లు



**క్షేత్రస్థాయిలో శ్రమించినా..**

అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ గత ఆరు నెలలుగా క్షేత్రస్థాయి నుంచి పని చేసుకుంటూ వచ్చింది. ఇతర రాష్ట్రాలకు చెందిన ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులు జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. నియోజకవర్గాల్లోనే వారం రోజుల పాటు ఉండి పార్టీ శ్రేణులను ఎన్నికల దిశగా కార్యోన్ముఖులను చేశారు. అయితే తీరా షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ప్రచారం నిర్వహించడంలో ఆ పార్టీ అభ్యర్థులు తేలిపోతున్నారు. చివరకు అగ్రనేతలు సైతం జిల్లాలో ప్రచారానికి దూరంగా ఉండటం కమలం పార్టీ అభిమానులకు కష్టంగా మారింది.

- భద్రాచలం నుంచి బీజేపీ అభ్యర్థిగా కుంజా ధర్మా పోటీ చేస్తున్నారు. మూడు దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితం ఆయన సొంతం. భద్రాచలం నియోజకవర్గంపై పట్టున్న నేతగా పేరుంది. గతంలో సీపీఎంలో పని చేసిన అనుభవంతో ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. దీంతో పాటు ధర్మా కుమారుడు సంతోష్ ప్రచార బాధ్యతలు భుజాన వేసుకున్నారు. భద్రాచలం వంటి ఆధ్యాత్మిక క్షేత్రంలో బీజేపీకి చెందిన జాతీయ నేతలు ఎవరు ప్రచారంలో పాల్గొన్నా సానుకూల ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. కానీ ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం ధర్మాకు లోటుగా మారింది.
- ఇల్లెందు నుంచి మాజీ ఎంపీ ధారావత్ రవీందర్ నాయక్ బరిలో ఉన్నారు. జిల్లాలో మిగిలిన అభ్యర్థులతో పోల్చితే ప్రచారంలో ముందు వరుసలో ఉన్నారు. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన స్టార్ క్యాంపెయినర్ ఈటల రాజేందర్ ఇల్లెందులో బహిరంగ సభ నిర్వహించారు. ఇల్లెందు పక్కనే ఉన్న మహబూబాబాద్‌లో జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభ ప్రచార ప్రభావం రవీందర్ నాయక్‌కు కొంతమేర కలిసొచ్చే అవకాశం ఉంది. బంజారాల ఓట్లే లక్ష్యంగా ఆయన తండాలను చుట్టి వస్తున్నారు.
- ఆదాయపు పన్ను శాఖ అధికారిగా ఉన్న పొడియం బాలరాజు పినపాక నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున బరిలో ఉన్నారు. అశ్వాపురానికి చెందిన ఆయన ప్రస్తుతం కొత్తగూడెంలో నివాసం ఉంటున్నారు. ఇప్పటి వరకు పొడియం తరఫున ప్రచారానికి ఆ పార్టీ పెద్దలు ఎవరూ రాలేదు. ఆఖరికి ఈటల రాజేందర్ బహిరంగ సభ కూడా రద్దయింది. ఏడు మండలాలు ఉన్న ఈ నియోజకవర్గంలో ఒక్కడే ప్రచారం చేసుకోవడం ఆయనకు తలకు మించిన భారంగా మారిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.
- జనసేన పార్టీ తరఫున కొత్తగూడెం నుంచి లక్కినేని సురేందర్, అశ్వారావుపేట నుంచి ఎం.ఉమాదేవి పోటీ చేస్తున్నారు. వీరి తరఫున ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ కొత్తగూడెంలో బహిరంగ సభ నిర్వహించారు. ఐదు నియోజకవర్గాలకు సంబంధించిన సభ అయినా చివరకు పేలవంగా ముగిసింది. బీజేపీ ప్రచార తీరుతెన్నులపై ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ స్పందిస్తూ.. గతంతో పోల్చితే జిల్లాలో బీజేపీ గణనీయంగా పుంజుకుందని, రాబోయే ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేందుకు పార్టీ తరఫున శక్తివంచన లేకుండా పని చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఈటల, పవన్‌కళ్యాణ్ ప్రచారం చేశారని, మహబూబాబాద్‌లో ప్రధాని మోదీ పాల్గొనే బహిరంగ సభ ప్రభావం జిల్లాపై తప్పకుండా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

**స్టార్ క్యాంపెయినర్లు ఇద్దరే..**

జిల్లాలో మొత్తం ఐదు అసెంబ్లీ స్థానాలు ఉండగా ఒకటి జనరల్, మిగిలిన నాలుగు ఎస్టీలకు రిజర్వ్ అయ్యాయి. ఎన్నికల పొత్తులో భాగంగా ఇల్లెందు, పినపాక, భద్రాచలం స్థానాల నుంచి బీజేపీ అభ్యర్థులు బరిలో ఉండగా కొత్తగూడెం, అశ్వారావుపేటలో జనసేన అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఇప్పటివరకు వీరి తరఫున ప్రచారం చేసేందుకు బీజేపీ స్టార్ క్యాంపెయినర్ ఈటల రాజేందర్, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ మాత్రమే జిల్లాలో పర్యటించారు. ఇక బీజేపీకి చెందిన మరే ఇతర అగ్రనేతలూ ఇటువైపు కన్నెత్తి చూడలేదు. దీంతో అభ్యర్థులే తమ శక్తి మేరకు ఆయా నియోజకవర్గాల్లో ప్రచారం చేసుకుంటున్నారు. అగ్రనేతల గ్లామర్ లేకపోవడంతో కమలనాథులు, జనసేన అభ్యర్థుల ప్రచారం స్వతంత్ర అభ్యర్థులకు ఎక్కువ.. ప్రధాన పార్టీలకు తక్కువ అన్నట్టుగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# హనుమంతుడిలా సేవ చేస్తా

**Interview**



- స్థానిక సమస్యలపై అసెంబ్లీలో పలుమార్లు నిలదీశా
- సీఎం కేసీఆర్ హామీలతోనే కాలం గడిపారు
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఈ ప్రాంతం అభివృద్ధి
- భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య

భద్రాచలం: అయోధ్య నగరానికి ఆదర్శ పాలన అందించిన రామయ్య స్వామి కొలువై ఉన్న భద్రాచలానికి హనుమంతుడిలా సేవ చేస్తానని స్థానిక ఎమ్మెల్యే, ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య అన్నారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్టానం ఆయనకు భద్రాచలం టికెట్ ఇవ్వగా విజయం సాధించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ప్రజాసమస్యలపై అసెంబ్లీలో పలుమార్లు గళమెత్తారు. ఈ ప్రాంత అభివృద్ధికి సీఎం కేసీఆర్ అనేక హామీలు ఇచ్చినా ఏ ఒక్కటీ అమలు చేయలేదని, ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే భద్రాచలం అభివృద్ధి సాధ్యమని చెబుతున్నారు. మరోసారి తనను ఆదరిస్తే భద్రాచలాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తానని అంటున్నారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

**నిరంతరం అందుబాటులో ఉంటున్నా..**

2018 ఎన్నికల సమయంలో ములుగు జిల్లా నుంచి ఇక్కడికి వచ్చినప్పటికీ ప్రజలు నన్ను ఆదరించి గెలిపించారు. అందుకే ఇక్కడికే మకాం మార్చి నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటున్నా. అధికార పార్టీ నాయకులు నన్ను నాన్ లోకల్ అంటున్నా పట్టించుకోను. ఇక్కడే ఉంటూ ప్రజల మధ్య తిరుగుతున్న నేనేంటో, నా వద్దకు వచ్చేవారిని ఎలా ఆదరిస్తానో.. సమస్యలు ఎలా పరిష్కరిస్తానో అందరికీ తెలుసు. కోవిడ్ సమయంలో బాధితులకు నాతో పాటు, కాంగ్రెస్ కార్యకర్తలంతా నిస్వార్థంగా సేవలందించాం. ప్రతీ గ్రామానికి నిత్యావసర సరుకులు పంపించాం. ప్రభుత్వ ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు రెమిడిసివర్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉండేలా చూశా. గతేడాది గోదావరి వరదల సమయంలో బాధితులకు బియ్యం, నిత్యావసర సామగ్రి అందించాం. భద్రాచలం ఆస్పత్రి అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా నిధులిప్పించా. క్యాంటిన్, బ్లడ్ బ్యాంకు ఆధునికీకరించాం. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎందరినో ఆదుకున్నా.

**సమస్యలపై అసెంబ్లీలో నిలదీశా..**

నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అవకాశం వచ్చినప్పుడల్లా అసెంబ్లీలో గళం వినిపించా. భద్రాచలం అభివృద్ధికి సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన రూ.100 కోట్లు, గోదావరి వరద ముంపు కాలనీల నిర్మాణానికి హామీ ఇచ్చిన రూ.1000 కోట్లు విడుదల చేయాలని పలుమార్లు నిలదీశా. స్థానికుల నుంచి అభిప్రాయసేకరణ చేయకుండా మూడు పంచాయతీలుగా విభజిస్తూ విడుదల చేసిన జీఓ 45ను రద్దు కోసం పోరాడాను. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన చర్ల, దుమ్ముగూడెం మండలాల రైతులను ఆదుకోవాలని, ఎకరానికి రూ. 30 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చా. పోడు రైతులందరికీ పట్టాలతో పాటు చర్ల, వెంకటాపురం మండలాల్లో ఉన్న వాగులపై బ్రిడ్జీలు నిర్మించాలని అసెంబ్లీలో డిమాండ్ చేశాను.

**ప్రభుత్వ సాయం లేకున్నా..**

ప్రతిపక్ష పార్టీలో ఉన్నప్పటికీ భద్రాచలం అభివృద్ధి కోసం నిరంతర పోరాడుతున్నా. అయితే నేను ప్రతిపక్ష ఎమ్మెల్యేను కావడంతో ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. నియోజకవర్గ నిధులు రూ.5 కోట్లు సైతం ఇవ్వకుండా ఈ ప్రాంత అభివృద్ధిని ప్రభుత్వం అడ్డుకుంది. పైగా సర్కారే నాపై నిందలు మోపుతోంది. రాష్ట్రానికి తండ్రి స్థానంలో ఉండి అన్ని ప్రాంతాల ప్రజలను సమానంగా చూడాల్సిన సీఎం కేసీఆర్ భద్రాచలంపై వివక్ష ప్రదర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పే కేసీఆర్, కేటీఆర్ భద్రాచలం అభివృద్ధిపై మాత్రం మాట దాటవేస్తారు. ఇప్పుడు వారిని గెలిపిస్తే అభివృద్ధి చేస్తామంటూ మాయమాటలు చెబుతున్నారు. ఈ ప్రాంత ప్రజలు వారి కల్లబొల్లి మాటలు నమ్మొద్దు. నన్ను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉండడంతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా.

# మహనీయుల స్ఫూర్తితో సేవలందించాలి

- వారి త్యాగనిరతిని ఆదర్శంగా తీసుకోవాలి
- రాజ్యాంగ దినోత్సవంలో కలెక్టర్ ప్రియాంక ఆల



ప్రమాణం చేయిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల, పక్కన అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మహనీయుల త్యాగ నిరతిని ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ ఉద్యోగులు సమాజానికి సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి, రాజ్యాంగ పీఠికకు పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజల హక్కులు, అవసరాలను ఆనాడే గుర్తించిన త్యాగధనులు రాజ్యాంగాన్ని రూపొందించారని చెప్పారు. అంబేద్కర్ వంటి మహనీయులు రెండు సంవత్సరాల 18 నెలల 11 రోజులు వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి పటిష్టమైన రాజ్యాంగాన్ని రచించారని వివరించారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించారని తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠిక పరిరక్షణకు కంకణబద్ధులై ఉంటామని ఉద్యోగులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీసీఓ వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, ఇరిగేషన్ ఈఈ అర్జున్, డీపీఓ రమాకాంత్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సులోచనారాణి, ఉపాధి కల్పనాధికారి విజేత, డీఎస్‌ఓ రుక్మిణి, బీసీ సంక్షేమాధికారి ఇందిర, ఎస్సీ అభివృద్ధి అధికారి అనసూర్య పాల్గొన్నారు.

**సూక్ష్మ పరిశీలకులకు పోస్టల్ బ్యాలెట్**

పోలింగ్ పర్యవేక్షణకు విధులు కేటాయించిన సూక్ష్మ పరిశీలకులు ఫారం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల అన్నారు. పోస్టల్ బ్యాలెట్ జారీపై ఎల్‌బీఎం, పోస్టల్ అధికారులతో కలెక్టర్ చాంబర్‌లో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విధులు కేటాయించిన 306 మంది మైక్రో అబ్జర్వర్లకు పోస్టల్ బ్యాలెట్‌ను జారీ చేస్తామనిచెప్పారు. వారికి ఎలాంటి సలహాలు, సూచనలు అవసరమైతే నియోజకవర్గ రిటర్నింగ్ కార్యాలయాల్లో 24 గంటలూ పని చేసేలా హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సూక్ష్మ పరిశీలకులుగా ఎల్‌ఐసీ, సింగరేణి, హెవీవాటర్ ప్లాంట్, బ్యాంకుల్లో పనిచేసే అధికారులను నియమించామని చెప్పారు. సమావేశంలో ఎల్‌బీఎం రామిరెడ్డి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు అలీం, కుసుమ కుమారి, నాగలక్ష్మి, రమాదేవి, శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు. కాగా, కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన ఈవీఎంల ర్యాండమైజేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక అల పరిశీలించారు.

కేటాయించిన అధికారులు వీరే..

| నియోజకవర్గం | నోడల్ అధికారి | హోదా | సెల్ నంబర్ |
|---|---|---|---|
| పినపాక | బి స్వర్ణ | అశ్వాపురం తహసీల్దార్ | 9392919719 |
| | ఎల్ వీరభద్రం | ఆళ్లపల్లి తహసీల్దార్ | 9392919717 |
| ఇల్లెందు | కె కృష్ణవేణి | టేకులపల్లి తహసీల్దార్ | 9392919737 |
| కొత్తగూడెం | జి. శిరీష | సుజాతనగర్ తహసీల్దార్ | 9392919736 |
| అశ్వారావుపేట | జి పుల్లారావు | ములకలపల్లి తహసీల్దార్ | 9392919733 |
| భద్రాచలం | పి చంద్రశేఖర్ | దుమ్ముగూడెం తహసీల్దార్ | 9392919726 |

# రేపటితో ప్రచారానికి తెర

- ఉమ్మడి జిల్లాను చుట్టేసిన రాజకీయ పార్టీల అగ్రనేతలు
- కేసీఆర్, కేటీఆర్ పర్యటనలతో జోష్‌లో గులాబీ శ్రేణులు
- రాహుల్, ప్రియాంక రాకతో కాంగ్రెస్‌లో కోలాహలం
- సీపీఎం, సీపీఐ నేతల సందడితో కామ్రేడ్స్ కదనోత్సాహం
- ఈ రెండు రోజుల ప్రచారంలో కీలక ప్రాంతాలపై నజర్



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎన్నికల ప్రచార సమరానికి మంగళవారం తెరపడనుంది. ఎక్కడెక్కడ బలహీనంగా ఉన్నామో తెలుసుకున్న పార్టీల నాయకులు మిగిలిన రెండు రోజులు ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. ఓ వైపు ఓటుకు నోటు పంచుతూనే మరోవైపు పోల్ మేనేజ్‌మెంట్‌పై నజర్ పెట్టారు. ఇప్పటివరకు జరిగిన ప్రచారం ఒక ఎత్తయితే.. ఓటరు మనసులో తమ గుర్తును ముద్రించి పోలింగ్ కేంద్రం వరకు తీసుకెళ్లడాన్ని కీలకంగా భావిస్తూ అభ్యర్థులు, అనుచరులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. బీఆర్‌ఎస్ అభ్యర్థుల తరఫున సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రచారం చేయగా.. కాంగ్రెస్ నుంచి రాహుల్, ప్రియాంకాగాంధీ, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా రావడంతో ఆయా పార్టీల కేడర్‌లో జోష్ పెరిగినట్లయింది. మరోవైపు బీజేపీ, జనసేన.. పవన్‌కళ్యాణ్, ఇతర ముఖ్య నేతలను తీసుకొచ్చి ప్రచారం చేయించింది. మొత్తానికి అగ్రనేతల ప్రచారం ముగియగా, మిగిలిన సమయంలో అభ్యర్థులు వ్యూహప్రతివ్యూహాల్లో మునిగి తేలనున్నారు.

**కాంగి'రేస్'లో అభ్యర్థులు**

గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో మెజార్టీ స్థానాలు దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఈసారీ అదే హవా ఉంటుందని భావిస్తోంది. క్షేత్ర స్థాయి సర్వే నివేదికల ఆధారంగా అభ్యర్థులను దఫదఫాలుగా ప్రకటించింది. ఆ తర్వాత ప్రచారానికి ఉన్న కొద్ది సమయాన్ని ప్రణాళికాయుతంగా వాడుకున్నట్లు పార్టీ చెబుతోంది. రాహుల్, ప్రియాంకాగాంధీ పర్యటన ఉమ్మడి జిల్లాలో అభ్యర్థులు, నేతలు, కేడర్‌లో ఉత్సాహాన్ని నింపాయి. మణుగూరులో రోడ్డు షోతో రాహుల్‌గాంధీ పినపాక నియోజకవర్గంలో ప్రచారాన్ని పూర్తి చేశారు. ఇక ప్రియాంకగాంధీ ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల్లో రోడ్డు షోలు, మధిరలో విజయభేరి సభకు హాజరై పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూనే బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎంపై విమర్శలు ఎక్కుపెట్టారు. మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. వీరేకాక ఏఐసీసీ, టీపీసీసీ నేతలు కూడా ప్రచారంలో పాల్గొన్నారు. అగ్రనేతల ప్రచారం ముగియడంతో అభ్యర్థులు ఇప్పటి వరకు వెళ్లని ప్రాంతాలను ఈ రెండు రోజుల్లో చుట్టాలని కార్యాచరణ రూపొందించుకున్నారు.

**పట్టు కోసం కామ్రేడ్లు..**

సీపీఎం ఈ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగింది. కొత్తగూడెం, పినపాక మినహా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ అభ్యర్థులు అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నారు. పాలేరు నుంచి పార్టీ రాష్ట్ర కారదర్శి తమ్మినేని వీరభద్రం పోటీలో నిలవగా.. ఎలాగైనా ఈసారి అసెంబ్లీ గేటు తాకాలని సర్వశక్తులు ఒడ్డుతోంది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో పాటు పొలిట్‌బ్యూరో సభ్యులు, త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. ఇక కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న సీపీఐ కొత్తగూడెం నుంచి బరిలోకి దిగింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పోటీలో నిలిచారు. జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి నారాయణ, రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలు కూనంనేని విజయం కోసం ప్రచారం నిర్వహించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ప్రచారానికీ వారు హాజరయ్యారు. సీపీఐ కొత్తగూడెం స్థానంపై ఆశలు పెట్టుకోగా ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించింది.

**బీజేపీ, జనసేన..**

బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా ఉమ్మడి జిల్లాలో అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలో దించాయి. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కొత్తగూడెంలో తమ పార్టీ అభ్యర్థి ప్రచారానికి హాజరయ్యారు. అలాగే, బీజేపీ రాష్ట్ర పార్టీ, జాతీయ పార్టీ నేతలను రప్పించి ప్రచారం చేయించింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని విమర్శలు చేస్తూ తమ అభ్యర్థులను గెలిపించాలని ఆపార్టీ నేతలు పిలుపునిచ్చారు.

**'గులాబీ' గుబాళించేలా...**

బీఆర్‌ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైరా మినహా సిట్టింగ్‌లందరికీ అవకాశం ఇచ్చింది. అన్ని పార్టీల కంటే ముందుగా టికెట్లు ప్రకటించగా, దాదాపు మూడు నెలల పాటు అభ్యర్థులు, పార్టీ శ్రేణులు ప్రచారాన్ని హోరెత్తించారు. సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు కలిసేలా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ ఎందుకు రావాలో చెబుతూ.. గత కాంగ్రెస్ పాలన తీరుపై ప్రతీ సభలో విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా స్థానికంగా తమ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని ప్రస్తావించారు. మళ్లీ గెలిస్తే నియోజకవర్గాల్లో చేయనున్న పనులపై హామీలు గుప్పించారు. పార్టీ అభ్యర్థులను ప్రశంసిస్తూ ఆయన ప్రసంగాలు కొనసాగాయి. రాష్ట్ర ఏర్పాటు తర్వాత రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్‌ఎస్‌కు అత్తెసరు స్థానాలే దక్కాయి. దీంతో ఈసారి తమ ప్రభుత్వమే రాబోతుందని, అందులో ఖమ్మం జిల్లా మెజార్టీ భాగస్వామ్యం ఉండేలా ప్రజలు సీట్లు ఇవ్వాలని కేసీఆర్ పదేపదే చెప్పారు. మంత్రి కేటీఆర్ రోడ్డు షోలు కూడా ఇలానే సాగాయి. దరిమిలా గులాబీ గుబాళించేలా ప్రచారం చేయగలిగామని.. తద్వారా గతంలో కంటే ఉమ్మడి జిల్లాలో ఆశాజనకంగా ఫలితాలు వస్తాయని ముఖ్యనేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## ప్రతీ ఒక్కరు బాధ్యతగా పని చేయాలి : ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రతీ పోలీసు బాధ్యతగా పని చేయాలని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి ఆదివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ విశిష్టత, ప్రజలు సాధించుకున్న హక్కుల గురించి వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చూడాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎవరైనా ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తే తక్షణమే కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈవీఎంల భద్రత, తరలింపులో ప్రణాళిక ప్రకారం పని చేయాలని ఆదేశించారు. అంతకుముందు ముంబై దాడుల్లో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.సాయిమనోహర్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు, డీఎస్పీలు వెంకటేశ్, అబ్దుల్ రెహమాన్, రాఘవేంద్రరావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఓట్ల జారీలో సందేహాలపై హెల్ప్‌డెస్క్

పినపాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్


ప్రతీక్‌జైన్

మణుగూరురూరల్: ఓట్ల జారీలో సందేహాలపై హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని పినపాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పినపాక నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల జారీకి సంబంధించి ఏమైనా సందేహాలు ఉన్నా, సహాయం కావాలన్నా మణుగూరు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ ఇన్‌చార్జ్ డి.ప్రదీప్ 96039 74452 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

### 'సాక్షి' విలేకరి వైద్యఖర్చులు భరిస్తా..

ఎంపీ బండి పార్థసారథిరెడ్డి


సాంబశివరావు కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎంపీ పార్థసారథిరెడ్డి

సత్తుపల్లి: బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్తుపల్లి 'సాక్షి'రూరల్ విలేకరి కొవ్వూరు సాంబశివరావు వైద్యానికి అయ్యే ఖర్చు మొత్తం భరిస్తానని ఎంపీ బండి పార్థసారథిరెడ్డి తెలిపారు. సత్తుపల్లి నుంచి ఆదివారం ఆయన సాంబశివరావు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. తమ సంస్థ నుంచి వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. ఇక త్వరలోనే ప్రారంభమయ్యే సింధు ఆస్పత్రిలో ఈ ప్రాంత జర్నలిస్టులకు ఉచిత వైద్యసేవలు అందిస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా సాంబశివరావు కుటుంబ సభ్యులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

### మెండు రాజమల్లుకు న్యాయశ్రీ అవార్డు..


అవార్డు అందుకుంటున్న రాజమల్లు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంనకు చెందిన సీనియర్ న్యాయవాది మెండు రాజమల్లు న్యాయశ్రీ అవార్డు అందుకున్నారని అంకెనపల్లి మల్లికార్జున్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మెగా సిటీ, నవ కళావేదిక, మదర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లోని న్యాయవాదులకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 2023 ఏడాదికి గాను న్యాయశ్రీ అవార్డులను ప్రదానం చేశారు. కాగా, హైకోర్టు న్యాయమూర్తి సూరిపల్లి నందా చేతులమీదుగా మెండు రాజమల్లు అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ మనవడు భీమ్‌రావు యశ్వంత్ అంబేద్కర్, రాపోలు భాస్కర్, మధుసూదన్, అంకెనపల్లి మల్లికార్జున్‌రావు, రాఘవసాయినాథ్, ఆర్.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అద్దంకి విజయ్‌కాంత్‌కు పీహెచ్‌డీ


విజయ్‌కాంత్

మధిర రూరల్: ఉస్మానియా యూనివర్సిటీ కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అద్దంకి విజయ్‌కాంత్‌కు డాక్టరేట్ లభించింది. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన విజయ్‌కాంత్ ఓయూలోనే కెమికల్ ఇంజినీరింగ్‌లో పీజీ పూర్తి చేశారు. ఓయూ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్.శ్యాంసుందర్ పర్యవేక్షణలో 'నావెల్ అండ్ ఇంటెన్సిఫైడ్ ప్రాసెస్ ఫర్ ద ప్రొడక్షన్ ఆఫ్ డైమిథైల్ ఫామా అమైడ్ డైమిథైల్ ఎసిటాల్' అంశంపై ఆయన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. దీంతో విజయ్‌కాంత్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఓయూ అధికారులు వెల్లడించారు.

### తాలిపేరు కాల్వ పనులు వేగంగా పూర్తి చేయాలి


అధికారులతో చర్చిస్తున్న ఈఎన్‌సీ నాగేంద్ర

దుమ్ముగూడెం: తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాల్వకు సంబంధించి అత్యవసర మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఈఎన్‌సీ నాగేంద్ర (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) అధికారులను ఆదేశించారు. దుమ్ముగూడెం మండలంలోని పెద్దనల్లబల్లి, కాటాయిగూడెం గ్రామాల్లో తాలిపేరు కాల్వలను ఎస్ఈ వెంకటేశ్వరరెడ్డితో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. పెద్దనల్లబల్లిలో 26వ కి.మీ. వద్ద సుమారు రూ.20 లక్షలతో, కాటాయిగూడెం ఆర్‌డీ 19 వద్ద సుమారు రూ.13 లక్షలతో చేపట్టిన పనుల పురోగతిపై ఆరా తీశారు. తాలిపేరు కాల్వ ద్వారా మండల రైతాంగానికి సక్రమంగా సాగునీరు అందేలా అధికారులు పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఈఈ హెచ్‌వీ.రాంప్రసాద్, డీఈ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఇది.. రాజులపేట..!

**ఒకే గ్రామం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు**

- ఇప్పటికే నాలుగు సార్లు గెలిచిన సండ్ర వెంకటవీరయ్య
- గత ఎన్నికల్లో విజయం సాధించిన కందాళ
- ఈసారి సత్తుపల్లి, పాలేరు నుంచి ఇద్దరూ బరిలో

కూసుమంచి మండలంలోని రాజుపేట రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఎందుకంటే ఈ గ్రామానికి చెందిన కందాళ ఉపేందర్‌రెడ్డి పాలేరు ఎమ్మెల్యే కాగా.. సండ్ర వెంకటవీరయ్య సత్తుపల్లి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈ ఎన్నికల్లోనూ వీరిద్దరు బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచారు. గ్రామస్తులు ఇద్దరు ఎమ్మెల్యేలుగా కొనసాగుతుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేల పనితీరుతో గ్రామానికి రాజకీయంగా పేరు ప్రతిష్టలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. – కూసుమంచి



ఎమ్మెల్యే వెంకటవీరయ్య ఇల్లు


రాజుపేటలోని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఇల్లు

**ఏడోసారి బరిలో సండ్ర**

వెంకటవీరయ్య విద్యార్థి దశలోనే రాజకీయ ఆరంగేట్రం చేశారు. విద్యార్థి నాయకుడిగా ఉండగానే తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం నుండి పాలేరు అసెంబ్లీకి పోటీచేశారు. తొలిప్రయత్నంలోనే కాంగ్రెస్ అభ్యర్థి సంభాని చంద్రశేఖర్‌పై 10,156 ఓట్ల తేడాతో గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. తిరిగి 1999లో సీపీఎం నుంచే పోటీ చేసి సంభానిపై 11,258 ఓట్లతో ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలో సీపీఎం నుండి టీడీపీలో చేరిన వెంకటవీరయ్య 2004లో పాలేరు నుండి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఈఎన్నికల్లో మరోమారు కాంగ్రెస్ అభ్యర్థి సంభాని చేతిలో 23,922 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. ఇక 2009లో పాలేరు జనరల్‌కు రిజర్వ్ కావడంతో వెంకటవీరయ్య ఎస్సీ రిజర్వ్ అయిన సత్తుపల్లి నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. 2009 నుండి వరుసగా మూడు పర్యాయాలు టీడీపీ నుండి సత్తుపల్లి ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. అనంతర పరిణామాల్లో బీఆర్ఎస్‌లో చేరిన ఆయన ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ నుండి బరిలో నిలిచారు.

**రెండోసారి బరిలో కందాళ**

పాలేరు ప్రస్తుత ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రస్తుతం రెండోసారి ఎమ్మెల్యేగా పోటీలో ఉన్నారు. 2018 ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావును 7,669 ఓట్లతో ఓడించారు. ఆతర్వాత బీఆర్ఎస్‌లో చేరిన కందాళ ఈ ఎన్నికల్లో అదే పార్టీ నుండి రెండోసారి పోటీలో ఉన్నారు. ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి ఇరువురు తొలిప్రయత్నంలోనే ఎమ్మెల్యేలు కావటం విశేషం. ఇక వెంకటవీరయ్య ఏకంగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందటం మరో విశేషంగా చెప్పుకోవచ్చు. ఈసారి ఫలితాల్లో ఇరువురి అదృష్టం ఎలా ఉందో వేచి చూడాల్సిందే.

జంగ్ తెలంగాణ

**మాకు గర్వంగా ఉంది**



మా ఊరికి చెందిన కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య ఎమ్మెల్యేలుగా ఉండటం మాకు గర్వంగా ఉంది. వారి వల్ల మా ఊరు రాజకీయంగా పేరు తెచ్చుకుంది. కందాళ ఉపేందర్‌రెడ్డి మంచి పనులు చేస్తూ ఊరి పేరు నిలబెట్టాడు. ఇద్దరూ ఈసారి ఎన్నికల్లో కూడా గెలిచి మా ఊరు పేరు నిలపాలి.

– పాలడుగు గిరిరాజు

**ఊరు అభివృద్ధి చెందుతోంది...**



మా ఊరి నుండి తొలుత ఎమ్మెల్యేగా సండ్ర వెంకటవీరయ్య ఉన్నారు. ఇప్పుడు ఆయనతో పాటు మా నియోజకవర్గానికే కందాళ ఉపేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. మా గ్రామం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండడంతో అభివృద్ధి చెందుతోంది. గతంతో పోలిస్తే చాలావరకు సమస్యలు పరిష్కారమయ్యాయి.

– బానోత్ మహేష్

**నా మేనల్లుడు నాలుగు సార్లు ఎమ్మెల్యే..**



సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య నా మేనల్లుడు. ఒకసారి పాలేరు, మూడు సార్లు సత్తుపల్లిలో ఎమ్మెల్యేగా గెలిచాడు. మా వాడు ఎమ్మెల్యే అని చెప్పుకోవడం ఆనందంగా ఉంది. ఉపేందర్‌రెడ్డిదీ మా ఊరే కావటం గర్వకారణం. మంచి పనులు చేస్తున్న ఇద్దరూ మళ్లీ గెలవాలని కోరుకుంటున్నా.

– కిన్నెర నర్సయ్య

## ఉద్యమకారులకు స్థానమేది?

- కేసీఆర్ కేబినెట్‌లో తెలంగాణ వ్యతిరేకులే ఎక్కువ
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ


మాట్లాడుతున్న నారాయణ

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాడిన వారికి కేసీఆర్ తన కేబినెట్‌లో సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని, తెలంగాణ వ్యతిరేకులకే ఎక్కువ మందికి స్థానం దక్కిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ కోసం నిరాహారదీక్ష చేసిన కేసీఆర్‌ను ఖమ్మం ఆస్పత్రికి తీసుకొచ్చిన సమయంలో.. ఇక్కడుంటే తాను బతకలేనని, నిమ్స్ ఆస్పత్రికి తరలించాలని కూనంనేని సాంబశివరావును కోరాడని, దీంతో ఆయన పండ్ల రసం తాగించారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో సహకరించిన కోదండరామ్ వంటివారిని పక్కన పెట్టేశారని, రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావస్తున్నా కేసీఆర్ నేటికీ ఓయూలో అడుగుపెట్టలేదని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని, అందుకే లిక్కర్ స్కామ్‌లో కవితను అరెస్ట్ చేయలేదని చెప్పారు. బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ని తప్పించడం కూడా వారి ఒప్పందంలో భాగమేనని ఆరోపించారు. బీసీ నేతను పక్కన పెట్టిన బీజేపీ.. ఇప్పుడు బీసీని సీఎం చేస్తామని చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. మరో నాలుగు రోజుల్లో ఎన్నికలు జరుగనుండగా, ఇప్పుడు రైతు బంధు సాయం అందించేందుకు ఈసీ అనుమతి ఇవ్వడం సరికాదని నారాయణ అభిప్రాయపడ్డారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ విషయంలో ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని, ఈ విషయాన్ని తాము కలెక్టర్, ప్రొసీడింగ్ అధికారులతో మాట్లాడామని తెలిపారు. ఫార్వర్డ్ బ్లాక్ తరఫున పోటీచేసే అభ్యర్థి రూ.కోటి చెల్లించి టికెట్ తెచ్చుకున్నాడని, ఆయనకు ఓటేస్తే అంతేసంగతులని హెచ్చరించారు. ఇక వనమా, ఆయన కుమారుడి సంగతి కూడా అందరికీ తెలిసిందేనన్నారు. అందుకే మిత్రపక్షాలు బలపరుస్తున్న సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును గెలిపించాలని కోరారు.

## ఎంపీ నామా, మంత్రి పువ్వాడ వాహనాలు తనిఖీ


మధిర : ఎంపీ నామా వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు


రఘునాథపాలెం : మంత్రి పువ్వాడ వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

మధిర/కొణిజర్ల: ఎన్నికల ప్రచారంలో భాగంగా మధిరకు వస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు వాహనాన్ని మండలంలోని ఆత్కూరు క్రాస్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆదివారం పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వారికి సహకరించగా, కాన్వాయ్‌లోని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వైరా ఏసీపీ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కొణిజర్లలోని చెక్‌పోస్ట్ వద్ద కూడా ఎంపీ వాహనాన్ని అధికారులు తనిఖీ చేశారు.

**మంత్రి పువ్వాడ వాహనం..**

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ముగించుకుని ఖమ్మం వెళ్తున్న రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ వాహనాన్ని నగరంలోని సాగర్ కెనాల్ వద్ద అధికారులు తనిఖీ చేశారు. తనిఖీలు పూర్తయ్యే వరకు సహకరించిన పువ్వాడ.. అనంతరం ముందుకు సాగారు.

## తాయిలాలకు లొంగి కేసీఆర్‌కు అధికారం ఇవ్వొద్దు

**ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు**

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, నిరంకుశంగా వ్యవహరిస్తున్న కేసీఆర్‌ను గద్దె దించడమే అందరి లక్ష్యం కావాలని.. ఇందులో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థుల తాయిలాలకు లొంగి ఓటు వేయొద్దని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాగైనా మూడోసారి అధికారంలోకి రావాలని కేసీఆర్ మద్యం, నగదు పంపిణీ మొదలుపెట్టారని విమర్శించారు. ఇలాంటి వాటిని ప్రజలు తిప్పికొట్టాలే తప్ప లొంగిపోవద్దని కోరారు. గత రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ రకరకాల పథకాలు ప్రకటించినా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. వేలాది కుటుంబాల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణలో కేసీఆర్ కుటుంబమే అభివృద్ధి చెందిందని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా మోసం చేశారని ఆరోపించారు. ఇక మోదీకి నమ్మిన బంటుగా మారి ఆయన తీసుకునే ప్రజా వ్యతిరేక విధానాలకు కేసీఆర్ అండగా నిలిచారని, వీరిద్దరికి గుణపాఠం చెప్పేలా బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించాలని రంగారావు పిలుపునిచ్చారు. సమావేశంలో వి.మనోహర్‌రాజు, ఆవుల వెంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య, ఆవుల అశోక్, కొల్లేటి నాగేశ్వరరావు, ఝాన్సీ, రాయల రవికుమార్, మంగతాయి, శిరోమణి, కె.శ్రీనివాస్, ఆజాద్, శోభ, వెంకటేష్, చందు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### బెల్ట్ షాపు నిర్వాహకులపై కేసు

భద్రాచలంఅర్బన్ : ఎన్నికల నియమావళిలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న నలుగురిపై టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారి వద్ద ఉన్న మద్యాన్ని సీజ్ చేసినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

### నగదు పట్టివేత

భద్రాచలంఅర్బన్ : పట్టణంలోని కూనవరం రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆదివారం ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదు పట్టుకున్నట్లు సీఐ నాగరాజురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి నుంచి రూ.1.02 లక్షలు గుర్తించామన్నారు.

### మెచ్చాను నిలదీసిన గ్రామస్తులు


ఎమ్మెల్యేను నిలదీస్తున్న గ్రామస్తులు

దమ్మపేట: స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును మండలంలోని గోపాలపురం గ్రామస్తులు నిలదీశారు. ఆదివారం దమ్మపేట మండలంలో ఎమ్మెల్యే మెచ్చా విస్తృత ప్రచారం నిర్వహించారు. గోపాలపురం గ్రామంలో రాత్రి సమయంలో మాట్లాడుతుండగా తాగునీటి సమస్యపై గ్రామస్తులు నిలదీశారు. రెండు వారాల నుంచి పంచాయతీ వాటర్ ట్యాంక్ మోటార్‌కు మరమ్మతులు చేయకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని, అయినా పట్టించుకునే నాథుడు లేడని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం వ్యవసాయ మోటార్లపై ఆధార పడాల్సి వస్తోందని గోడును వెళ్లబోసుకున్నారు.

### అదృశ్యంపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్ : పట్టణంలోని కొత్తరాజులగుట్ట ప్రాంతానికి చెందిన పాయం నాగమణి ఈనెల 20న బ్యాంక్‌కు వెళుతున్నానంటూ బయటకు వెళ్లి ఇంతవరకూ తిరిగి రాలేదని ఆమె భర్త పాయం కొండయ్య ఆదివారం భద్రాచలం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెదికినా ఆమె ఆచూకీ లభించలేదని పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుప్రసాద్ తెలిపారు.

### తండ్రి మందలించాడని ఆత్మహత్య

టేకులపల్లి: తండ్రి మందలించాడనే మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బోడు ఎస్ఐ బత్తిని రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గంగారానికి చెందిన జోగ శంకర్–శ్రీలత చిన్న కుమారుడు జోగ అరుణకుమార్ (14) పాల్కెలగండి ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. వారం క్రితం ఇంటికిరాగా, తిరిగి వెళ్లాలని తండ్రి సూచించినా వెళ్లలేదు. దీంతో ఆదివారం తండ్రి గట్టిగా మందలించడంతో ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. ఆయనను కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

### బోర్ యజమానిపై కేసు నమోదు

ఇల్లెందురూరల్: మండలంలోని మామిడిగూడెం పంచాయతీ అందుగులబోడు సమీప అటవీ ప్రాంతంలో ఎలాంటి అనుమతి లేకుండా బోరు వేస్తున్న యంత్రాన్ని ఆదివారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు కొమరారం ఎఫ్ఆర్ఓ ఉదయ్ తెలిపారు. పట్టుబడిన బోర్‌యంత్రాన్ని ఇల్లెందు కలపయార్డ్‌కు తరలించామని చెప్పారు.

### కేఓసీలో ఇనుప సామగ్రి చోరీ

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్ కాస్టులో ఇనుప సామగ్రి చోరీ ఘటనపై బోడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ బత్తిని రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి ఎస్అండ్‌పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్ అక్బర్ అలీ కోయగూడెం ఓపెన్‌కాస్టు స్టోర్ వెనుక గల పాత ఇనుప సామగ్రి యార్డును ఆదివారం తనిఖీ చేయగా రూ.15వేల విలువైన సామగ్రి కనిపించలేదు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేశారు.

## అభ్యర్థులను ఆశీర్వదించే యోగానందుడు!

- ఆయన అనుగ్రహం తీసుకున్నాకే ముందుకు...
- ప్రతీ ఎన్నికల ముందు 'భట్టి' పూజలు
- ఈసారి కూడా కొనసాగిన ఆనవాయితీ


శ్రీయోగానంద లక్ష్మీనరసింహాస్వామి ఆలయం, ధ్వజస్తంభం


యోగానంద లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భట్టి విక్రమార్క (ఫైల్)

ముదిగొండ: ముదిగొండ మండలం యడవల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనరసింహాస్వామి ఆలయానికి 800 ఏళ్ల చరిత్ర ఉంది. కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్వితుడిగా పేరు ఉన్న ఆయనను భక్తులు నిష్ఠతో కొలుస్తారు. ఇదేకాకుండా పలువురికి విజయాలు అందించిన దేవుడిగా కూడా స్వామికి పేరు! అసెంబ్లీ ఎన్నికల వేళ మండలంలో ప్రచారం మొదలుపెట్టాలంటే ఏ పార్టీ అభ్యర్థి అయిన స్వామిని దర్శించుకుని పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

**'జలగం' నుంచి మొదలు**

ప్రజలకే కాకుండా ఎన్నికల్లో పోటీకి దిగే నేతలకు శ్రీయోగానంద లక్ష్మీనరసింహాస్వామి అభయమిస్తున్నారు. 1977–78లో జలగం వెంగళరావు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీకి దిగినప్పుడు మొదట స్వామిని దర్శించుకున్నాకే ప్రచారం మొదలుపెట్టారు. ఇక 1981–82లో అసెంబ్లీ అభ్యర్థిగా ఎన్నికల ప్రచారానికి మొదలు ఇక్కడ పూజలు చేశారు. ఆతర్వాత పాలేరు ఎమ్మెల్యేగా పోటీచేసిన సంభాని చంద్రశేఖర్ రెండు పర్యాయాలు యడవల్లిలోని యోగానందలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు చేశాకే ముందుకు సాగారు. అనంతరం సండ్ర వెంకటవీరయ్య కూడా ఇక్కడ సెంటిమెంట్‌గా పూజలు చేసి ప్రచారం మొదలుపట్టారు. ప్రస్తుతం మధిర నుంచి మూడు సార్లు గెలిచిన మల్లు భట్టి విక్రమార్క ప్రతీసారి ఈ ఆలయంలో పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి ఎన్నికల్లో కూడా ఆయన స్వామిని దర్శించుకున్నాకే మండలంలో ప్రచారాన్ని ప్రారంభించారు. అలాగే, బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్ కూడా గత ఎన్నికల వేళ స్వామిని దర్శించుకున్నారు. ఆ ఎన్నికల్లో ఆయన స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయినప్పటికీ... ఈసారి కూడా సెంటిమెంట్‌గా శ్రీయోగానంద లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ఆరంభించారు. ఇలా 46 ఏళ్లుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఎక్కువ మంది గెలుపోటములను పట్టించుకోకుండా స్వామిని దర్శించుకున్నాకే ప్రచారాన్ని మొదలుపెడుతున్నారు.

**స్వామి అనుగ్రహంతో విజయాలు**



ఈ ఆలయానికి దాదాపు 800ఏళ్ల చరిత్ర ఉంది. ఏ కార్యం చేపట్టే ముందైనా మహిమాన్వితుడైన స్వామిని దర్శించుకుంటే విజయాలు సిద్ధిస్తాయి. మా తాత, తండ్రి మొదలు నేను ఇక్కడ స్వామి అనుగ్రహంతో ప్రధాన అర్చకులుగా కొనసాగుతున్నాం. కోరిన కోర్కెలు తీర్చే శ్రీయోగానంద లక్ష్మీనరసింహుడిని దర్శించుకుంటే అంతా మంచే జరుగుతుంది.

– సిరికొండ లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు

### రామయ్యను దర్శించుకున్న ఎన్నికల పరిశీలకులు


పంచవటి కుటీరంలో అధికారులు

దుమ్ముగూడెం: భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఎన్నికల పరిశీలకులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అజయ్‌లాల్ సోనీజీ (ఐఆర్ఎస్), సంజిత్‌పాల్ (ఐఆర్ఎస్), ఐటీసీ అధికారి చంగల్‌రావు పర్ణశాలకు రాగా అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి దర్శనం చేయించారు. అలాగే, ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేయగా, పంచవటి కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించి వాటి విశిష్టతను తెలుసుకున్నారు.



**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.